# సత్యవాక్కు

# the word of truth

క్రైస్తవ మాసపత్రిక

SEPTEMBER 1996

# సంక్షిప్త వార్తలు

1996 ఆగష్టు నెల 7వ తేదీ బుధవారం సోదరులు జాషువా గూటం గారు సతీ సమేతంగా విశాఖపట్టణం జిల్లా చోడవరంలో యున్న సంఘమును దర్శించి, వారి మధ్య వాక్య పరిచర్య గావించిరి. అక్కడనుండి దామునాపల్లి కూడ వెళ్లి స్థానిక సంఘము నిర్మించుచున్న ఆలయమును పర్యవేక్షించిరి. చోడవరం, దామునాపల్లి ఏరియాలలో సోదరులు M. ప్రసంగి గారు సువార్త పరిచర్య చేయుచు క్రీస్తు కొరకు మంచిపని చేయు చున్నారు.

ఆగష్టు 10 వ తేదీ శనివారం జాషువా గారు సతీసమేతముగా పశ్చిమ గోదావరి జిల్లా ఓదూరులో వాక్య పరిచర్య గావించిరి. ఆ రోజు 13 మంది క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందుట ద్వారా ఆ గ్రామములో క్రీస్తు సంఘము నెలకొల్పబడెను. ఓదూరులో సోదరులు M. స్తెఫను గారు, B .D ప్రసాదరావ్ గారు సువార్త చాటించు చున్నారు. ఆ గ్రామములో సోదరి సుశీల గారి పరిచర్య కూడ గమనార్హమైనది.

ఆగష్టు 20వ తేదీ మంగళవారం తూర్పు గోదావరి తాడిపూడి గ్రామములో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గారు రిబ్బను కత్తిరించి ప్రవేశము గావించిరి. ఆ రోజు భారీ వర్షము కురిసినను అనేకులు హాజరై దేవుని స్తుతించిరి. జాషువా గారు, పి.యస్.ఆర్. జైపాల్ గారు వాక్య పరిచర్య చేసిరి. తాడిపూడి సోదరులు సి.హెచ్. వెంకట్రావ్ గారు దేవుని కొరకు మంచిపని చేయు చున్నారు. తాడిపూడిలో యున్న సంఘము మరింత బలపడులాగున ప్రార్థించ మనవి.

ఆగష్టు 22 ,23, 24 తేదీలలో గుంటూరు జిల్లా నర్సారావ్‌పేటలో బైబిలు క్లాసులు, సువార్త కూటములు జరిగెను. ఆ కూటములకు పలు ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులు హాజరై జయప్రదము గావించిరి. సోదరులు జాషువా గూటం గారు, హైదరాబాద్ నుండి వచ్చిన వాధిని లూక్ గారు, తదితరులు వాక్య పరిచర్య చేసిరి. కూటముల అనంతరం 8మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. 24వ తేదీ సాయంత్రం నర్సారావ్‌పేటకు ఆనుకొని యున్న లెప్పర్ కోలనీని సోదరులు జాషువా గారు, వాధిని లూక్ గారు, తదితర సువార్తికులు సందర్శించి వారికి వాక్య పరిచర్య చేసిరి. బొంతా మోజెస్ దంపతులు ఆ సాయంత్రం కోలనీ వాసులకు భోజన ఏర్పాట్లు చేసిరి. నర్సారావ్ పేటలోను,

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884-63722**

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**


**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 సెప్టెంబరు 1996 సంచిక 2


## సంపాద కీయం.

# దేవుని క్రొత్త నిబంధన
## (God's New Covenant)

" ప్రభువు ఇట్లనెను- ఇదిగో యొక కాలము వచ్చు చున్నది. అప్పటిలో ఇశ్రాయేలు ఇంటివారి తోను , యూదా ఇంటివారి తోను నేను క్రొత్త నిబంధన చేయుదును" (హెబ్రీ8:8).

క్రైస్తవుడు ఎక్కడ వున్నా అతడు మంచి పౌరుడు(రోమా 13:1). అతడు యోగ్యమైన మంచి శాసనములు చేయబడాలని కాంక్షిస్తాడు, వాటిని గౌరవిస్తాడు. అతడు చట్టబద్ధుడై జీవిస్తాడు. దేవుడు తన ప్రజలతో చేసిన నిబంధనలలో మార్పు చేసాడు. ఈ మార్పును ఆయన సంకల్పించాడు, దాన్ని గూర్చి ప్రవచింపజేసాడు. యిదంతయు లోకమును రక్షించుటకు ఆయనకు గల దయా దాక్షిణ్యము వలన సంకల్పించాడు. ఇశ్రాయేలుతో ఆయన చేసిన పాత నిబంధన కాలము సంపూర్ణ మయ్యేవరకు అమలులో యుండెను. అయితే క్రీస్తు రక్తము వలన ముద్రింపబడిన క్రొత్త నిబంధన దాని స్థానమున వచ్చెను (హెబ్రీ 8:7,13).

ఈ క్రొత్త నిబంధన రాబోవు చున్నదని యిర్మియా ప్రవచించాడు. ఇక నిరీక్షణ అంటూ యేమీ లేదను కొనుచున్న కాలములో, గొప్ప నిరీక్షణను గూర్చి, శ్రేష్టమైన నిబంధనను గూర్చి దేవుడు యూదాకు నిర్ధారణ యిచ్చాడు, యెరూషలేము పతనమగుటను గూర్చి, బబులోను చెరను గూర్చి యిర్మియా చూచినప్పుడు, క్రొత్త నిబంధన కాలములో దేవుడు తన ప్రజలకు సంకల్పించిన భవిష్యత్తును గూర్చి యిలా వ్రాసాడు:

"ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను, యూదావారి తోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధన వంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి; యిదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలు వారితోను, యూదా వారితోను చేయ బోవు నిబంధన యిదే. వారి మనస్సులలో నా ధర్మ విధి ఉంచెదను, వారి హృదయము మీద దాని వ్రాసెదను; యెహోవా వాక్కు యిదే. నేను వారికి దేవుడనై యుందును, వారు నాకు జనులగుదురు. వారు మరి ఎన్నడును- యెహోవాను గూర్చి బోధనొందుదము అని తమ పొరుగు వారికి గాని, తమ సహోదరులకు గాని ఉపదేశము చేయరు; నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసి కొనను గనుక అల్పులేమి, ఘనులేమి అందరును నన్నెరుగుదురు; ఇదే యెహోవా వాక్కు"(యిర్మియా 31:31-34).

యిర్మియా ప్రవచనమును ఆధారముగా జేసికొని హెబ్రీ పత్రిక లేఖకుడు పాత క్రొత్త నిబంధనల తారతమ్యమును చూపించాడు, ఆనాడు కలుగు చున్న హింసల వలన క్రొత్తగా క్రైస్తవులైన వారు బలహీనులై తిరిగి యూదా మతమునకు వెళ్లుచుండిరి, అట్టి వారిని బల పర్చుటకు గాను హెబ్రీ పత్రిక వ్రాయబడినది.

దేవుని యొక్క క్రొత్త నిబంధన ఫలితమే క్రీస్తు సంఘము. అందువలన యిర్మియా యొక్క ప్రవచనమును మనము విశ్లేషించి చూచిన యెడల, సంఘము యొక్క తత్వమును గ్రహించు కోగలము. క్రొత్త నిబంధన సంఘము యొక్క తత్వమును గూర్చి యేమి సూచించు చున్నది?

# క్రొత్త హృదయము

పాత క్రొత్త నిబంధనలలో కనబడు గొప్ప తార తమ్యములలో ఒకటి, దేవుని సంకల్పములో హృదయాని కియ్యబడిన స్థానము. దేవుడిట్లు చెప్పాడు: "వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను; వారి హృదయము మీద దాని వ్రాసెదను... వారు నాకు జనులగుదురు' '(హెబ్రీ 8:10). క్రొత్త నిబంధనలో దేవుడు ప్రతి క్రైస్తవునికి ఒక క్రొత్త హృదయాన్నిచ్చాడు. క్రొత్త హృదయం కలిగిన వారే సంఘము.

జన్మ ద్వారా ఒకడు పాత నిబంధనలో ప్రవేశించాడు. వంశావళిని బట్టి అతడొక ఇశ్రాయేలీయుడే గాని ఆత్మ సంబంధమైన నిర్ణయమును బట్టికాదు. అందు వలన ప్రతి యూదుడు దేవునితో తనకు గల సంబంధమును గూర్చి ఉపదేశింపబడేవాడు. జన్మ ద్వారా యూదుడు దేవునితో ప్రత్యేక నిబంధనలో ప్రవేశించినను, అతనికి సరిగ ఉపదేశించ బడేవరకు దానిని గ్రహించు కోలేక పోయేవాడు. దేవునితో తమకు గల ప్రత్యేక సంబంధమును గూర్చి యూదులకు నిరంతరము ఉపదేశించ బడేది.

అది అలాగుండగా, దేవుని చిత్తమునంగీకరించి, విశ్వాసము ద్వారా దానికి విధేయత చూపుట వలన కలుగు నూతన జన్మ ద్వారా ఒకడు క్రొత్త నిబంధనలో ప్రవేశించును. దేవుని గూర్చిన జ్ఞానము గాని, ఆత్మీయ రాజ్యములో ప్రవేశించుదమను బుద్ధి పూర్వక నిర్ణయము గాని లేకుండా క్రొత్త జన్మ సంభవించదు(యోహాను6:44,45). దేవుని రాజ్యములో యున్న ప్రతివాడు రక్షణ వర్త మానమును వినియున్నాడు(రోమా 10:17). ఆ వర్తమానమును అంగీకరించి యున్నాడు(అపొ. కా. 2:41). మరియు ఆ వర్తమాన ప్రకారము విశ్వాసమునకు విధేయత చూపుటకు నిశ్చయించు కొనిన వాడై యున్నాడు(అపొ.కా. 2:40).

క్రైస్తవుల క్రొత్త హృదయములపై దేవుని శాసనములు లిఖింపబడి యున్నవి. దేవుని చిత్తమును జరిగించుటకు అవసరమైన విశ్వాస ప్రేమల వలన మనము పురి కొల్ప బడుదుము(I యోహాను 5:3). ఆయన వర్తమానము మొదట్లో మన హృదయాల్లో విశ్వాసప్రేమలు జనింప జేసింది.తత్ఫలితముగా మన మాయన బిడ్డలమైతిమి. ఆయన వాక్యమును నిత్యము నెమరు వేయుచు, ఆయన ప్రేమ, కృపలను ధ్యానించుచు, ఆయనతో అను దినము నడుచుట వలన మన క్రొత్త హృదయములను నడిపించుదుము.

## క్రొత్త క్షమాపణ

మరొకటి, దేవుడిచ్చు క్షమాపణలో ఈ రెండు నిబంధనల యొక్క తారతమ్యము మనకు కనబడును. ఆయనతో క్రొత్త నిబంధనలో ప్రవేశించు వారికి దేవుడిట్లు చెప్పాడు: "నేను వారి దోషముల విషయమై దయగలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు"(హెబ్రీ 8:12). దీనిని మనం 'క్రొత్త క్షమాపణ' యని పిలువ వచ్చును, దేవుని నుండి నిజముగా క్షమాపణ నొందిన వారే క్రీస్తు సంఘము.

మోషే ధర్మశాస్త్రములో జంతుబలులు అర్పించుట వలన పాపములు ఏటేటా జ్ఞాపకమునకు తేబడేవి(లేవీ.కా.16). క్రీస్తు వచ్చి మనుష్యులందరి కొరకు ఒక్క మారే అర్పింప బడే వరకు ధర్మశాస్రము ఋనపని చేసుకుంటూ వచ్చెను(హెబ్రీ 9:15).అయితే క్రీస్తు అర్పింప బడే వరకు వారికి నిజమైన క్షమాపణ లభించలేదు. ఆయన సిలువపై చనిపోయి సంపూర్ణ క్షమాపణ ననుగ్రహించెను. ఇప్పుడు క్రొత్త నిబంధనలో సంపూర్ణముగా క్షమాపణ లభించు చున్నది. పాపమునకు పరిపూర్ణ బలిగా క్రీస్తు అర్పింప బడెను. మన ప్రధాన యాజకునిగా ఆయన పరలోకములో ప్రవేశించెను. ఆయన తండ్రి యొక్క కుడి పార్శ్వమున కూర్చొని మనకొరకు విజ్ఞాపన చేయు చున్నాడు( I యోహాను 2:1).

నీతి మంతులుగా తీర్చ బడిన వారమై మనము క్రీస్తు శరీరములో జీవించుచున్నాము. గత పాపము లన్నిటినుండి మనము శుద్ధిచేయ బడితిమి(రోమా 3:24). మరియు దిన దినము చేయు పాపములనుండి మనము కడుగ బడుచునే యున్నాము: " ఆయన వెలుగులో నున్న ప్రకారము మనము వెలుగులో నడిచిన యెడల... ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (I యోహాను 1:7).

## క్రొత్త సంబంధము

దేవునితో మనకు గల సంబంధములో నిబంధనలకున్న తారతమ్యము మరొకటి మనకు కన్పడును. క్రొత్త నిబంధనలో ప్రవేశించు వారిని గూర్చి దేవుడిట్లు పలికెను: "వారిలో ఎవడును-ప్రభువును తెలిసి కొనుడని తన పట్టణస్థుని కైనను, తనసహోదరుని కైనను ఉపదేశము చేయడు. వారిలో చిన్నలు మొదలు కొని పెద్దల వరకు అందరును నన్ను తెలిసి

కొందురు'' (హెబ్రీ8:11). పాత నిబంధనలోని వారి కంటె క్రొత్త నిబంధనలో దేవునితో మన సంబంధము మరింత వ్యక్తిగతమైనది; సన్నిహితమైనది, సంఘము దేవుని ప్రజలతో సమకూడినది.

క్రొత్త జన్మ ద్వారా మనం దేవునితో ఒక క్రొత్త సహవాసములో ప్రవేశించాము. దేవుని కుటుంబములో జన్మించుటకు ప్రతివాడు ఎంచుకొనినందున ఈ క్రొత్త నిబంధన ప్రవేశము కలిగినది. అందువలన క్రొత్త నిబంధనలో యున్న ప్రతివాడు దేవునితో తండ్రి-కుమారుల సంబంధము ననుభవించును(గలతీ 4:6,7). అందువలన ఈ క్రొత్త నిబంధన యొక్క పునాదులను వేస్తు యేసు, "పరలోక మందున్న మా తండ్రీ!''యను ప్రార్థన నేర్పించెను(మత్తయి 6:9). అన్ని నిబంధనల వలె క్రొత్త నిబంధనలో కూడ సూత్రములున్నవి. అయితే దేవునితో గల సన్నిహిత సంబంధము క్రొత్త నిబంధనకు కేంద్రమై యున్నది. దేవుడు మన తండ్రి. మనమాయన పిల్లలము. దేవుడు, ఆయన కుమారుడైన క్రీస్తు నిత్యము మనతో యుంటారు. పరిశుద్ధాత్ముడు మనలో నివసించును. మనం దేవుని ప్రార్థిస్తాము, ఆయన వాక్కుననుసరిస్తాము, మరియు ఆయన పనిని సంతోషముగా జరిగిస్తాము.

## ముగింపు

క్రొత్త నిబంధన మూలముగా సంఘము సృజింప బడినది. సంఘము క్రొత్త హృదయం, క్రొత్త క్షమాపణ, దేవునితో క్రొత్త సంబంధము గలిగిన ప్రజలని గుర్తించు కొనవలెను. దేవుని ధర్మశాస్త్రము మన హృదయముల మీద వ్రాయబడి యున్నది. ప్రేమ ద్వారా కార్య సాధకమగు విశ్వాసమును బట్టి మన మాయన చిత్తమును జరిగించుటకు ప్రయత్నించెదము(గలతీ5:6). మనం నిజమైన క్షమాపణ పొందిన ప్రజలము. మన పాపపు ఋణము పూర్తిగా తీర్చి వేయబడినది. దేవునితో మనం వ్యక్తిగత సన్నిహిత సంబంధము కలిగి యున్నాము. దేవుడు మన తండ్రి, యేసు మనపెద్ద అన్న, మరియు సజీవుడైన దేవుని యొక్క ఆత్మ మనలో నివసించును.

ఈ క్రొత్త నిబంధన అందరికీ వర్తించును. "మీరు సర్వ లోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధించ బడునని''యేసు చెప్పెను(మార్కు16:15,16). దేవుని వర్తమానమును అంగీకరించి దానికి లోబడు వాడెవడైనను ఈ క్రొ త్త నిబంధనలో ప్రవేశించ వచ్చును. అతడు దేవుని కుటుంబములో సభ్యునిగా, క్రీస్తు సంఘస్థునిగా ఆత్మీయాశీర్వాదములు పొందవచ్చును.

- ఎడ్డీక్లోర్ (TFT)

# పది యాజ్ఞలు

## ( The Ten Commandments )

అపొ. పౌలుధర్మ శాస్త్రము యొక్క ప్రయోజనమును, కాలపరిమితిని తెలుపుతు, "అది వాగ్దానము చేయబడిన సంతతి వచ్చు వరకు "ఇయ్యబడెను అనిచెప్పెను(గలతీ 3:19). ఆ సంతానము క్రీస్తు అని అంతకు ముందే 16వ వచనములో అతడు తెలియజేసాడు. గనుక ధర్మశాస్త్రము క్రీస్తు వచ్చువరకు మాత్రమే అమలులో యుండుటకు నియమింప బడెను."మనలను క్రీస్తు నొద్దకు నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెనని" అతడు వివరించాడు(గలతీ 3:24). "అయితే విశ్వాసము వెల్లడి యాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" అని కూడ అతడు వక్కాణించాడు(25వ). ధర్మశాస్త్రము ఒక ప్రాధమిక ఉపాధ్యాయుని వంటిది. మనం ఇక దాని క్రింద లేము.

క్రీస్తు సిలువ యొద్ద ధర్మశాస్త్రము ఎత్తి వేయబడెనని చెప్పు లేఖన బాగములు అనేకములున్నవి. "దేవుడు వ్రాత రూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దాని మీది చేవ్రాతను తుడిచి వేసి, మనకు అడ్డము లేకుండా దానిని ఎత్తి వేసెను"(కొలస్స 2:14)."ఇదియు గాక యాజకులు మార్చబడిన యెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును." "ఆధర్మశాస్త్ర ము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగ జేయలేదు గనుక ముందియ్యబడిన ఆజ్ఞ బలహీనమైనందునను, నిష్ప్రయోజనమైనందునను, అది నివారన చేయబడియున్నది. అంతకంటే శ్రేష్టమైన నిరీక్షణ దానివెంట ప్రవేశపెట్ట బడెను." "ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవ దానికి అవకావముండ నేరదు." "ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు"(హెబ్రీ 7:12,18-19; 8:7; 9:15). క్రీస్తు సిలువ మీద చనిపోయనప్పుడు, క్రొత్త నిబంధనను స్థిరపరచుటకు పాత నిబంధనను(మొదటిదానిని) కొట్టి వేసెను(హెబ్రీ 10:9).

కొట్టి వేయబడిన ధర్మ శాస్త్రములో పది యాజ్ఞలు ఇమిడి యుండెను. రాతి పలకల మీద చెక్కబడి, మరణ కారణమగు పరిచర్యయైన ఈ పది యాజ్ఞలు కొట్టి వేయబడెను. అయితే నీతికి కారణమగు పరిచర్యయైన క్రీస్తు చట్టము, పది యాజ్ఞల కంటె అధిక మహిమ గలదై నేటికిని నిలిచి యున్నది(2కొరింథీ 3:6-11).

పాత నింబంధన క్రీస్తు సిలువ యొద్ద అంతము చేయబడినను, పది యాజ్ఞలలో తొమ్మిది ఆజ్ఞల యొక్క సూత్రములు క్రొత్త నిబంధనలో బోధింప బడెను. వాటిని గమనించుదము. నిర్గమ 20:3-17 చదువుము:

1. **నేను తప్ప వేరొక దేవుడు నీకుండ కూడదు:**
   అపొ.కా. 17:23-31; రోమా 1:23-25; I కొరింధీ 8:4,6.

2. **విగ్రహారాధన చేయ కూడదు:**
   అపొ.కా. 14:11-17; I కొరింధీ 6:9-10; 10:7,14,19,20;
   2 కొరింధీ 6:16,17; గలతీ 5:19-21; ఎఫెసీ 5:3-6; కొలస్స 3:5
   I యోహాను 5:21; ప్రకటన 21:8; 22:15

3. **దేవుని నామమును వ్యర్ధముగా నుచ్చరింపకూడదు:**
   యాకోబు 5:12

4. **విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము:**
   క్రీస్తు మరణము తరువాత ఈ యాజ్ఞ ఒక్కటే తిరిగి చెప్పబడలేదు. క్రొత్త నిబంధన సంఘములో విశ్రాంతి దినము(7వ రోజు) ఆరాధన దినము కాదు. సంఘము ప్రభురాత్రి భోజనము నాచరించుటకు, కానుక లిచ్చుటకు ప్రతి ఆదివారమున కూడు కొనిరి(అపొ.కా.20:7; I కొరింధీ 16:1-2). మరియు విశ్రాంతి దినాచారమును క్రొత్త నిబంధన ఖండించు చున్నది(గలతీ 4:10-11; కొలస్స 2:16-17).

5. **నీ తండ్రిని, తల్లిని సన్మానించుము:**
   ఎఫెసీ 6:1-3; కొలస్స 3:20

6. **నరహత్య చేయకూడదు:**
   రోమా 13:9; I యోహాను 3:15; ప్రక 21:8; 22:15

7. **వ్యభిచరించ కూడదు:**
   రోమా 13:9; I కొరింధీ 6:13-18; గలతీ 5:19-21; ఎఫెసీ 5:3-6;
   కొలస్స 3:5; I థెస్స 4:4-7; హెబ్రీ 13:4; ప్రక 21:8; 22:15.

8. దొంగిల కూడదు:

రోమా 13:9; I కొరింథీ 6:10-11; ఎఫెసీ 4:28

9. నీ పొరుగు వాని మీద అబద్ధ సాక్ష్యము పలుక కూడదు:

రోమా 13:9

10. నీ పొరుగు వానిది యేదీ ఆశించకూడదు:

రోమా 7:7; 13:9; I కొరింథీ 6:10; ఎఫెసీ 5:5;

కొలస్స 3:5; I తిమోతి 6:9-11,17; హెబ్రీ 13:5

పాత నిబంధన, పది యాజ్ఞలు కొట్టి వేయబడెనని ఆందోళన చెందనక్కర్లేదు. వాటి స్థానమున ఒక క్రొత్త నిబంధన ఈయబడెనని జ్ఞాపకముంచుకొనుము. ఈక్రొత్త నిబంధనలో పది యాజ్ఞలలోని తొమ్మిది చేర్చ బడినవి. సరిగదా మరింత విస్తరింప జేయబడినవి. వాటికి మనము బద్ధులమై యున్నాము. అవి పాత నిబంధనలో యున్నాయని గాక, క్రొత్త నిబంధనలో భాగమై యున్నందున వాటికి మనం బద్ధులము.

క్రైస్తవులు విశ్రాంతి దినము నాచరించాలని ఎన్నడు ఆజ్ఞాపింప బడలేదు గనుక పది యాజ్ఞలలోని నాలుగవ ఆజ్ఞ క్రొత్త నిబంధనలో కనబడదు. విశ్రాంతి దినమును అతి క్రమించినందున క్రొత్త నిబంధన కాలములో ఎవనికిని శిక్ష విధింపబడుట, లేక అపరాధియని ఆరోపింపబడుట ఎన్నడు జరుగలేదు. క్రైస్తవులు ప్రతి ఆదివారమున క్రీస్తు యొక్క పునరుత్థానమును ఆచరింతురు గాని ఐగుప్తులోనుండి పొందిన విడుదలను కాదు.

-టామ్ కెల్టన్

## క్రీస్తు కొరకు యితరులను సంపాదించు మార్గము

## ( Ways to Reach People for Christ )

దేవుని ప్రజలుగా మన పని యితరులను క్రీస్తు కొరకు సంపాదించుటయే. మనం అభివృద్ధి జెందునట్లు ఫలములు ఫలించాలి. ప్రభువు యొక్క సువార్తను వ్యాపింప జేయాలి. మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి యని క్రీస్తు చెప్పారు (మార్కు

16:15). అపొస్తలుల కార్యముల గ్రంథమును చదివిన యెడల అపొస్తలులు, వారి ద్వారా మార్పు జెందినవారు నిరంతరము సువార్త ప్రకటించుచున్నట్లు కనుగొనగలవు. తత్ఫలితముగా వేలకొలది ప్రజలు సువార్తకు లోబడిరి, సంఘముతో చేర్చబడిరి. అందువలన ఆసియాలోని ప్రముఖ పట్టణములలోను, వివిధ దేశములలోను సంఘము స్థాపించబడుట జరిగినది. హింసలు సంభవించినను, సంఘాభివృద్ధి కుంటుబడలేదు. సరిగదా సంఘము మరింత అభివృద్ధి జెందినది, సువార్త లోకమందంతటా వ్యాప్తి జెందినది.

పైన చెప్పబడిన సంగతులు చాల యింపుగా యున్నను,మొదటి శతాబ్దములో ఈయబడిన గొప్ప ఆజ్ఞనే మనము కూడ కలిగి సర్వలోకానికి సువార్త ప్రకటించే బాధ్యతను నేడు కలిగి యున్నాము. అయితే క్రీస్తు కొరకు యితరులను సంపాదించుటకు మనమేమి చేయగలము? మనం అనేక సంగతులు చేయగలము. వివిధ పద్ధతుల నుపయోగించి క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించగలము. మొట్టమొదటిగా, క్రైస్తవులవలె మనం దేవునికి నమ్మకముగా యుండాలని గ్రహించుకోవాలి,మనం మంచి మాదిరిని నెలకొల్పాలి. మనచుట్టూయున్న వారికి ప్రభువు ప్రజలంటే ఎట్లుంటారో తెలియజేయాలి.

మనం క్రమము తప్పక ఆరాధనలకు హాజరు కావాలి. మనం కుటుంబ సమేతముగా హాజరవ్వాలి. మనం ఇట్లు చేయకపోతే మనలను ఎరిగిన వారిని క్రీస్తు కొరకు సంపాదించలేము, మన కుటుంబ సభ్యులనే కాదు,మన చుట్టూయున్న వారిని కూడ క్రీస్తు నుండి దూరం చేసిన వారమవుతాము. చిన్న పిల్లలు ముఖ్యముగా వారికి సరియైన తర్ఫీదు ఇయ్యక పోతే వారు పెద్ద వారయ్యే సరికి దేవుని నుండి దూరమవుతారు, గనుక వారిని గూర్చియైనను సరే, మీరు వారి యెదుట సరియైన మాదిరిని నెలకొల్పాలి, మంచి మాదిరిని వారు తప్పక అనుసరించగలరు.

మీకున్న దూరపు బంధువులను కూడ మీరు క్రీస్తు కొరకు సంపాదించగలరు. మీ మిత్రులు, మీ సహచరులు, తోటి పనివారు- వారి సంగతి యేమిటి? మీరు, మీ కుటంబమువారిని ఆరాధనకు ఆహ్వానించలేరా? ఇంకో సంగతి, మీదగ్గర సువార్త పత్రికలు, పుస్తకములు వగయిరా ఎల్లప్పుడు దగ్గర ఉంచుకోవడం మంచిది. వీటిని మీకు తెలిసినవారికి ఇయ్యవచ్చును, మరియు బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో వారిని చేర్పిస్తే చాల మంచిది.

మీ ఇరుగు పొరుగు వారికి, మిత్రులకు ఏదైనా ప్రత్యేక అవసరత యున్నప్పుడు వారిని దర్శించి ప్రార్థన చేయుట మంచిది. వారిలో ఎవరైనా అనారోగ్యముగా యున్నా, ఆపదలో

యున్నా వారిని దర్శించి, సహాయ సహకారాలు అందించితే వారు మీలో యున్న సత్ క్రైస్తవ లక్షణాలను గుర్తిస్తారు. ఈ రీతిగా మీరు క్రీస్తును గూర్చి వారికి బోధించే అవకాశం దొరుకును.

క్రీస్తును గూర్చి బోధించునప్పుడు మీరు ప్రజలను బలవంతముగా క్రైస్తవులను చేయుటకు ప్రయత్నించవద్దు, సరిగదా, "మనుష్యులు మీ సత్ క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" యని యేసు ప్రభువు చెప్పారు(మత్తయి 5:16). ఒకడు క్రైస్తవుడు కాగోరుచున్న యెడల అతడు తన బుద్ధిపూర్వకముగానే ఆ నిర్ణయానికి రావాలి. తనంతట తానే క్రీస్తులోనికి మార్పు జెందుటకు నిశ్చయించుకోవాలి. అతడు అట్టి నిర్ణయానికి వచ్చుటకు గాను నీవు క్రీస్తును గూర్చి అతనికి బోధించాలి. అతడు క్రీస్తు సువార్తకు విధేయుడగుట ఎట్లో నీవు బోధించాలి.

క్రీస్తు యొక్క సువార్తను వ్యాపింప జేయుటకు దేవుడు మనందరికీ సహాయం చేయును గాక, అనేక ఆత్మలను సంపాదించునట్లు దేవుడు మిమ్మును, మీ కుటుంబాన్ని, స్థానిక సంఘాన్ని వాడు కొనును గాక!

- J.C.ఛోట్.

## ఒక హెచ్చరిక మాట

## ( A Word of Warning )

యేసు ఇట్లు చెప్పెను: "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని, పరలోక మందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును"(మత్తయి 7:21). దేవుని మార్గము ఇరుకైనది. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది. దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది" (మత్తయి 7:13,14).

యేసునకు లోబడువారిని ఆయన రక్షించును(హెబ్రీ 5:10). రక్షింపబడ వలెనంటే ఒకడు సువార్తను విని విశ్వసించవలెను(రోమా1:16). విశ్వాసమును గూర్చిన ఆజ్ఞ వలె మారు

మనస్సును గూర్చిన కూడ సార్వజనిక మైనది, యేసు దేవుని కుమారుడని మనము విశ్వసింపని యెడల మన పాపములలోనే యుండి చనిపోవుదుమని యేసు ఖండితముగా చెప్పెను(యోహాను 8:24). అన్ని చోట్ల యుండు మానవులందరు మారు మనస్సు పొంద వలెననునది సార్వజనిక ఆజ్ఞ(అపో.కా 17:30).

యేసుకు మార్గము సిద్ధ పరచుటకు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చెను(మత్తయి 3:2). మానవులు తమ పాపముల నుండి వైదొలగ వలెనని అతడు భోధించెను.యేసు కూడ బోధింప నారంభించినప్పుడు మానవులు మారు మనస్సు పొంద వలెనని బోధించెను(మత్తయి 4:17). మారు మనస్సు, పాప క్షమాపణ రెండు మిళితమై యున్నవని యేసు చెప్పెను(లూకా 24:47).

మారు మనస్సు పొందినప్పుడు మనమేమి చేతుము? పాపములనుండి తిరుగుదుము. భారత దేశములో బోధకులమని చెప్పుకొనేవారు కొందరున్నారు, గాని అబద్ధాలు చెప్పి విదేశీ ధనమును ఆర్జించు చున్నారు. అది ధూపేక్ష, ధనాపేక్ష విగ్రహారాధన లాంటిది(కొలస్స 3:5). విగ్రహారాధన వలన దేవుని ఉగ్రత వచ్చును, విగ్రహముల నుండి సజీవుడైన దేవుని తట్టు ప్రజలను త్రిప్పుటయే మన పని. అయితే సంఘము విగ్రహారాధన నుండి మరలవలెను. ధనాపేక్ష విగ్రహారాధన యని జ్ఞాపక ముంచుకొనుము. రక్షింపబడ వలెనంటే మనము మారు మనస్సు పొందాలి. ప్రజలు మారు మనస్సు పొందినప్పుడు తమ దుష్ట మార్గములనుండి తిరుగుదురు.

ప్రభువు యొక్క వాగ్దానములు స్థిరమైనవి. మరణ పర్యంతము నమ్మకముగా నుండిన యెడల నిత్య జీవ కిరీటమును పొందుదుము(ప్రకటన 2:10). శరీరాత్మల కల్మషము నంతటినీ మనము విసర్జించాలి. ప్రభువు యొక్క సన్నిధిలో పరిశుద్ధతను పరిపూర్ణము చేయాలి.

- జె. సి. బెయిలీ.

మీరు క్రీస్తు సంఘములో బోధకులైనను, కాకపోయినను, ఉద్యోగస్థులైనను, విద్యార్థులైనను, గృహిణులైనను కాకపోయినను **Basic Bible Course** లో చేరండి. క్రొత్త నిబంధన సత్యమును విపులముగా తెలిసికొనండి. ఉచిత పాఠముల కొరకు ఈరోజే మాచిరునామాకు వ్రాయండి;

SATYA VANI, P.O.Box. 80, Kakinada - 533 001

# ఆయన రాజ్యమును నీతిని వెదకుట

## ( SEEKING FIRST HIS KINGDOM AND RIGHTEOUSNESS )

(మత్తయి 6 : 33)

" మీరు ఆయన రాజ్యమును, నీతిని, మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకను గ్రహింపబడును" అని మత్తయి 6:33 లో యేసు ప్రభువు బోధించారు. ఈ రోజు రాజ్యమును, నీతి ని వెదకుట అంటే యేమిటో తెలిసి కొనుటకు ప్రయత్నము చేయుదము.

ప్రభువు చెప్పిన ఈ మాటలలో ' వెదకుడి ' యను మాట ముఖ్యమైనది. మనము వెదకినట్లయిన ఆయన రాజ్యమును, నీతిని కనుగొనగలమని యేసు ప్రభువు యొక్క ఉద్దేశ్యము. మనం యేమి చేయాలో, ఎట్లుండాలో తెలిసి కొనగలము. దేవుడు మన నుండి కోరునదేదో మనము తెలిసి కొనగలము సరిగదా ఆయన కోరు దానిని జరిగించ గలము, ఆయన రాజ్యమును, నీతిని కనుగొన గలము.

వెదకుడి యను మాటలో వెదకుచు యుండుడి యనే భావమున్నది. మనము ఆయన రాజ్యమును, నీతిని వెదకుచునే యుండాలి. అపొ.పౌలు ఇట్లనుచున్నాడు:"ఇది వరకే నేను గెలిచితినని యైనను, ఇది వరకే సంపూర్ణ సిద్ధి పొందితినని యైనను నేను అనుకొనుటలేదు, గాని నేను దేని నిమిత్తము క్రీస్తు యేసు చేత పట్టబడితినో దానిని పట్టు కొనవలెనని పరుగెత్తు చున్నాను"(ఫిలిప్పీ 3:12). "అందువలన సహోదరులారా మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసి కొనుటకు మరి జాగ్రత్త పడుడి. మీరిట్టి క్రియలు చేయు వారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్షకుడు నైన యేసు క్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అను గ్రహింపబడును" అని అపొ.పేతురు చెప్పాడు (2 పేతురు 1:10,11).

దేవుని రాజ్యములో యుండడం, ఆయన నీతిని తెలిసి కొనడం ఇంచుమించు ఈరెండింటి భావము ఒక్కటే. దేవుని రాజ్యమును గూర్చి బైబిలు చెప్పునప్పుడు, ఆయన సృష్టించిన వాటిపై ఆయన సార్వభౌమత్వాన్ని సాధారణంగా సూచిస్తాది."యెహోవా భూమ్యాకాశముల యందుండు సమస్తమును నీ వశము; మహాత్మ్యమును, పరాక్రమమును,

ప్రభావమును, తేజస్సును, ఘనతయు నీకే చెందుచున్నవి. యెహోవా, రాజ్యమునీది, నీవు అందరి మీదను నిన్ను అధిపతిగా హెచ్చించుకొని యున్నావు అని 1దినవృత్తాంతములు 29:11లో వ్రాయబడి యున్నది.

## రాజ్యమే సంఘము

యేసు ప్రభువు మాటలలోని దేవుని రాజ్యము క్రీస్తు సంఘమై యున్నది. ఆయన నీతియనగా ఆయన వాక్యము. ఆయన సువార్త. ఏ సువార్త వలననైతే ఒకడు రక్షింపబడి ఆయన రాజ్య పౌరుడవుతాడో ఆ సువార్తే ఆయన నీతి. గనుక మొదట మనము క్రీస్తు సంఘమును, క్రీస్తు సువార్తను వెదకిన యెడల, మన కవుసరమైన వన్నియు ఆయనే తీర్చుతాడు.

ఆయన రాజ్యమును, నీతిని వెదకువారికి రెండు రకాలైన ఆశీర్వాదములున్నాయి. దేవుని బిడ్డలైన వారికి ఇహలోక ఆశీర్వాదములు, పరలోక దీవెనలు కూడ ఆయన వాగ్దానము చేసారు. దేవుడు అడవి పువ్వులను, ఆకాశపక్షులను పోషించున్న యెడల, ఆయన తన బిడ్డలను కూడ తప్పక సంరక్షిస్తాడనే ధైర్యము, విశ్వాసము మనకున్నది. అయినను భౌతిక ఆశీర్వాదముల కన్నా ఆత్మీయాశీర్వాదములు మేలైనవి. "యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజుల వలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు. సొమ్మసిల్లక నడిచి పోవుదురు" (యెషయా 40:31).

దేవుని రాజ్యమును వెదకుట అంటే ఈలోకమును, లోకస్థులను సంపూర్ణముగా విసర్జించుట యని కొందరి భావన. తమ శరీరములను గాయపరచుకోవాలని, శరీరాశలను పూర్ణముగా విసర్జించాలని వారి భావన. అయితే దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నదని యేసు ప్రభువు చెప్పారు. మనం ఈ లోక మర్యాదననుసరించి నడుచు కొనరాదు, గాని ఈ లోకస్థులను క్రీస్తువైపు మార్చే బాధ్యత గలవారము. మన శరీరం దేవుని ఆత్మకు ఆలయమైనది. దానిని మనం పాడుచేయక, సంరక్షించి, ఆరోగ్యం కలిగి దేవుని సేవ చేయాలి.

దేవుని రాజ్యమును, నీతిని వెదకుట అంటే ధనవంతులము కాకూడదనే మరొక అసత్య భావం కలిగి కొందరున్నారు. దేవుని రాజ్యాన్ని వెదకితే ఒకని ధనాన్నంతా పంచి పెట్టేయాలని వారనుకొంటారు. ధనవంతులు క్రీస్తు శిష్యులు కాకూడదని బైబిలు ఎక్కడా బోధించుట లేదు. సరిగదా ధనవంతులైన వారు కూడ దేవునికి ప్రీతికరమైన సేవ చేయగలరు.

అబ్రాహాము తన కాలములో చాల ఐశ్వర్యవంతుడు. అతడు దేవునికి ప్రీతికరమైన సేవచేసాడు. అతడు విశ్వాసులకు తండ్రి. దేవుడు అతనిని బహుగా ఆశీర్వదించాడు. మనం అక్కర గలవారికి సహాయపడుటకు వీలుకలుగు నిమిత్తము కష్టపడి పనిచేసి ధనాన్ని సంపాదించాలని అపొ.పౌలు బోధించాడు (ఎఫెసీ 4:28)."మరియు అన్నిటి యందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వ సమృద్ధిగలవారై ఉత్తమమైన ప్రతి కార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింప చేయగలడు" అని అతడు కొరింధీయులను హెచ్చరించాడు (2 కొరింధీ 9:8).

ధనవంతులై యుండుట తప్పు అని బైబిలు బోధించుట లేదు: అది దురాశను, ధనము యొక్క దుర్వినియోగాన్ని ఖండించుచున్నది. క్రీస్తు సంఘములో పెక్కుమంది ధనవంతులు ఉండడం అవుసరం. వారు దేవునికిస్తారు. దేవుడు వారికిస్తాడు. వారిద్వారా ఆయన రాజ్యం మరింత విస్తరిస్తాది.

దేవుని రాజ్యానికి, లేక క్రీస్తు సంఘానికి రక్షకుడు యేసు క్రీస్తే. ఏలయనగా సంఘము ఆయన శరీరమై యున్నది. ఆ శరీరానికి ఆయనే రక్షకుడు(ఎఫెసీ 5:23). ఒకడు ఆయన నీతి సువార్తకు లోబడినప్పుడు, యేసు అతని రక్షకుడవుతాడు. పాపమునకు బాధ్యత వ్యక్తిగతమైనది, రక్షణ వ్యక్తిగతమైనది గనుక ఒకడు వ్యక్తిగతంగానే సువార్తకు లోబడతాడు.

## ఆజ్ఞలకు లోబడాలి

దేవుని రాజ్యాన్ని నీతిని మొదట వెదికే వారు యేసుప్రభువు యొక్క ఆజ్ఞలన్నిటికి లోబడతారు. తమ కిష్టమొచ్చిన ఆజ్ఞలను గైకొని, ఇష్టములేని వాటిని విడిచి పెట్టే వారుకారు. దేవుని చిత్తాన్ని జరిగించుటలో వారు దేనిని నిర్లక్ష్యం చేయరు. యేసుప్రభువు ఇట్లన్నారు:"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతి వాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నాతండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును".(మత్తయి 7:21).దేవుని రాజ్యాన్ని వెదికే వారు ఆయన చిత్తాన్ని సంపూర్ణముగా నెర వేరుస్తారు(లూకా 6:46).

దేవుని రాజ్యాన్ని నీతిని వెదికేవారు ఈ లోకాన్ని వెంబడించుట మాని క్రీస్తునే వెంబడిస్తారు. క్రీస్తును వెంబడించుటలో కొన్ని శ్రమలు, ఇబ్బందులు, ఇక్కట్లు సంభవించ వచ్చును. ఇస్సాకును బలి ఇమ్మని దేవుడు అబ్రాహాముకు చెప్పినప్పుడు దానికి లోబడుట

అబ్రాహాముకు కష్టతరమైనది. అయినను అతడు విశ్వాసమును బట్టి దేవుని ఆజ్ఞకు లోబడెను. దేవుని చిత్తాన్ని జరిగించుటలో అపొస్తలులు, ఆదిమ సంఘము అనేక హింసలను, శ్రమలను, చివరకు మరణాన్ని ఎదుర్కొన్నారు. అయితే లోకాన్ని విసర్జించి క్రీస్తును వెంబడించుటలో నిత్యమహిమ, నిత్యసంతోషము లభించును. మరణ పర్యంతము నమ్మకముగా యుండుము, నేను నీకు నిత్యజీవకిరీట మిచ్చెదను అని యేసుప్రభువు వాగ్దానము చేసారు(ప్రక 2:10).

దేవుని రాజ్యాన్ని నీతిని మొదట వెదికేవారు, ఏమి చేసినా వారి శక్తివంచన లేక చేస్తారు. అందరికీ మేలు చేయుటకే ప్రయత్నిస్తారు. ఒకడు మెకానిక్ కావచ్చును, డాక్టరు కావచ్చును, ఉపాధ్యాయుడు కావచ్చును, గుమాస్తా కావచ్చును, చివరకు కూలీవాడు కావచ్చును. వారేమి చేసినను నిష్కపటమైన మనస్సును కలిగి తమ పనులు చేస్తారు. తద్వారా క్రీస్తుకు ఘనత తెస్తారు."దాసులారా, యదార్థమైన హృదయము గలవారై భయముతోను, వణకుతోను క్రీస్తునకు వలె శరీర విషయమై మీ యజమానులైన వారికి విధేయులై యుండుడి... మనుష్యులకు చేసినట్టు కాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా సేవచేయుడి" యని అపొ.పౌలు హెచ్చరించాడు(ఎఫెసీ 6:5-9).

దేవుని రాజ్యాన్ని నీతిని వెదికే వారు మొదట యేసు ప్రభువు దేవుని కుమారుడని విశ్వసిస్తారు. తమ పాపముల విషయమై మారు మనస్సు పొందుతారు. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందుతారు. అట్టి వారికి దేవుడు ఇహపరములందు సంతోషాన్ని , సమాధానాన్ని, నిత్యజీవాన్ని ప్రసాదిస్తాడు.

- జాషువా గూటం

-- 0 --

## ప్రమాదకరమైన పాపము

## ( The most dangerous Sin )

ఒక యౌవనస్తురాలైన తల్లిని గూర్చి ఒక కథగలదు. ఆమె తన బిడ్డను ఒక పెద్ద చెట్టుక్రింద నీడలో యుంచి ప్రక్కనే యున్న పొలములో పనిచేసి కొనుటకు వెళ్ళింది. చాలా

పనిలో నిమగ్నమై యుండుటవల్ల ఆమె తన బిడ్డను గూర్చి మరచినది ఆమె తన పని ముగించుకొని వచ్చినప్పటికి వేసవికాలపు సూర్యుడు ఆబిడ్డ జీవితాంతము గ్రుడ్డిదైనది. తల్లి ఏ హాని జరుగదు అనుకొన్నది. కాని ఆమె నిర్లక్ష్యము వల్ల ఆమె, ఆమెబిడ్డ జీవితాంతము చాలాబాధను అనుభవించవలసి వచ్చినది.

బైబిలు చాలాసార్లు నిర్లక్ష్యము వల్ల కలుగు ప్రమాదమును గూర్చి హెచ్చరించుచున్నది. అన్ని పాపములకంటే నిర్లక్ష్యము చాలా ప్రమాదకరమైనది. ఏఏ కారణములతేత అలక్ష్యము(నిర్లక్ష్యము) పాపమో మనము తెలిసి కొందాము.

## ప్రమాదకరము

నిర్లక్ష్యము ప్రమాదకరమైనది ఎందుకనగా అది మోసపరచు స్వభావము కలది. దేవుని ప్రజలు హత్య, అబద్దము, త్రాగుబోతు తనము, వ్యభిచారము, మరియు దొంగతనము అనివాటికి గొప్ప పాపముగా భావిస్తారు. కాని మనము జరిగించవలసిన అనేక నీతికార్యములను నిర్లక్ష్యము చేయుటను పాపముగా భావించరు. మనము చేయుపాపములను గూర్చి భయము కలిగి యుందుము గాని చేయవలసిన వానిని విడిచి పెట్టుటవలన కలుగు పాపమును గూర్చి భయమును కల్గియుండుట లేదు.

నిర్లక్ష్యము అనునది అపాయకరమైనది ఎందుకనగా దానికి ప్రయత్నము అవుసరములేదు. చేయుటవల్ల కల్గు పాపములకు (Sins of Commission) శక్తి కావాలి. కాని విడిచి పెట్టుటవల్ల కల్గు పాపములకు ( Sins of Ommission ) ప్రయత్నము లేక శక్తి అవసరము లేదు. ఉదా:- అవసరములో ఉన్నవారిని తప్పించుకొనుటకు, ఇతరులకు సత్యమును చాటి చెప్పు అవకాశము వచ్చినపుడు బోధింప కుండుటకు, ఆరాధనకు హాజరు కాక పోవుటకు, బైబిలుతరగతికి హాజరు కాకుండుటకు మరియు దేవుని పరిచర్యకు సంబధించిన ఏ కార్యము నయినను తప్పించు కొనుటకు ప్రయత్నము అవుసరము లేదు.

## అపాయకరము

నిర్లక్ష్యము అనునది అపాయకరమైనది ఎందుకనగా అది అన్ని పాపములకు మూల్గమైనది. వ్యవసాయ భూమిలో కలుపు మొక్కలు ఉండకూడదు కాని నిర్లక్ష్యము చేసిన పొలములో కలుపు

మొక్కలు, ముండ్లు త్వరగా పెరిగిపోతాయి. అన్ని చెడు కార్యములకు విరుగుడు ఏమనగా మనము చేయవలసిన పనులను సరిగా నిర్వర్తించుట. పాత నిబంధన గ్రంధములో దావీదు పనిలేక తిరుగు చున్నపుడు అతడు బెత్షెబాతో పాపము చేయుటకు దారి తీసెను. పని లేక యున్నపుడు మనము ఇతరుల తప్పు లెన్ను వారముగాను, దేవుని ప్రజల మధ్య అసమ్మతి కలుగ జేయుటకును ఆస్వాధము కలవారమై ఉందుము.

నిర్లక్ష్యము అనునది అపాయకరమైనది ఎందుకనగా అది ఆత్మకును మరియు సువార్త ఉద్దేశమునకును విరుద్దమైనది. ఇశ్రాయేలీయులకు "నీవు చేయవద్దు" అను ఆజ్ఞలు ఈయబడెను. కాని సువార్త చెప్పున దేమనగా "నీవు చేయుము." చాలామంది "మంచిగా ఉండాలని" ఉద్దేశిస్తారు కాని దేవుడు కోరునదేమనగా "మేలుచేయాలి" మరియు "మంచిగా ఉండాలి" (అపో.కా. 10:38).

నిర్లక్ష్యము అపాయకరమైనది ఎందుకనగా నిర్లక్ష్యము చేయువారు నశించుపోవుదురు. మత్తయి 25:14-30 చదివినట్లయిన మనకు ఈ సత్యము తేట తెల్లమగుచున్నది. ఈ ఉపమానములోని సేవకుడు క్రూరత్వమునకు గాని, అవినీతికి గాని, అవిధేయతకు గాని లోనైన వాడు కాదు. అయినప్పటికి అతడు శపించబడ్డాడు- ఎందుకనగా తన యొక్క తలాంతుని పాతిపెట్టాడు. తన అవకాశాన్ని నిర్లక్ష్యము చేసాడు.

మనము ఒక ప్రశ్న విని యున్నాము అదేమనగా "రక్షింపబడుటకు నేనేమి చేయాలి?' ' ఇపుడు మనము ఈలాగు అడగబడుతున్నాము." తప్పిపోవుటకు(పోగొట్టు కొనుటకు) నేనేమి చేయాలి?" ఒక్క మాటలో "ఏమి చేయనక్కరలేదు."

ఒక కుర్రవాడు వేగముగా ప్రవహించుచున్న నదిలో పడినప్పుడు అతడు రక్షింప బడుటకు చాలా ప్రయత్నము చేయాలి. కాని నశించుపోవుటకు ఏ ప్రయత్నము చేయనక్కరలేదు.మానవుడు పాపము చేయుట వల్ల తప్పిపోయి యున్నాడు( రోమా 3:23). ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేయుటవల్ల నిత్య జీవాన్ని పోగొట్టు కొనుచున్నాడు.

- గోర్డన్ హొగన్ ( vot )

-- 0 --

# క్రీస్తును ఘనపరచుట యెట్లు

## ( How to Honour Christ )

"తండ్రిని ఘన పరచునట్లుగా అందరు కుమారుని ఘన పరచ వలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు; కుమారుని ఘన పరచిన వాడు ఆయనను పంపిన తండ్రిని ఘన పరచడు" (యోహాను 5:22,23).

ఈ లేఖన భాగంలో మూడు సంగతులు బోధింపబడ్డాయి. రెండు సంగతులు విపులంగా చెప్పబడ్డాయి. (1) తండ్రిని ఘన పరచునట్లుగా కుమారుని ఘనపరచాలి. (2) కుమారుని ఘన పరచని వాడు తండ్రిని ఘనపరచడు. (3)తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగింప బడియున్నది.

కుమారుని ఘన పరచుటయే తండ్రిని ఘన పరచుటయని భావింప బడినది. అందువలన కుమారుని ఘనపరచుట యెట్లో మనం తెలుసు కొనుటకు ప్రయత్నించాలి. క్రీస్తును ఘన పరచుట యెట్లో లేఖనముల నుండి మనం ఇప్పుడు గమనిద్దాం.

## క్రీస్తును ఒప్పు కొనుటలో ఆయనను ఘనపరచాలి

క్రీస్తును ఒప్పుకొనుట ద్వారా మనం ఆయనను ఘనపరుస్తాం. అనేక సాక్షుల యెదుట తిమోతి చేసిన ఒప్పుకోలే యిది(1 తిమోతి 6:12,13). " నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పేతురు ఆయినను గూర్చి చేసిన ఒప్పుకోలు యిది. మత్తయి16:16; అపో.కా. 8:37). రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పు కోవాలని రోమా 10:10లో మనకు చెప్పబడినది. ఈ మంచి ఒప్పుకోలులో ఒక గొప్ప ప్రాముఖ్యత యున్నది. యేసు అను పేరులో ఆయన మానవత్వము మనకు జ్ఞాపకం చేయబడుచున్నది. క్రీస్తు అను మాటలో అభిషిక్తుడని- మనకు తెలియ జేయబడుచున్నది. ఆయన దైవత్వాన్ని జ్ఞపకం చేయడంలో "ఆయన దేవుని కుమారుడని" చెప్పుబడుచున్నది.

## బాప్తిస్మములో ఆయనను ఘనపరచాలి

బాప్తిస్మములో మనము క్రీస్తును ఘన పరచుదుము. నీతి యావత్తును నెరవేర్చుటకు క్రీస్తు తానే బాప్తిస్మము పొందాడు. గనుక బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను మనం గమనించగలము(మత్తయి 3:14,15). ఆయన బాప్తిస్మాన్ని మానవులకు ఆజ్ఞాపించాడు. "మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి "యని యేసు తన శిష్యులనాజ్ఞాపించాడు(మత్తయి 28:19). "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింప బడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును"(మార్కు 16:16). అపోస్తలుల కార్యముల గ్రంధములో మార్పు చెందిన వారి ప్రతి సంధర్భములోను బాప్తిస్మము చెప్పబడియున్నది. మనం బాప్తిస్మము పొందినప్పుడు క్రీస్తు ఘనపరచ బడుచున్నాడు. మనం బాప్తిస్మము పొందుటకు నిరాకరించినపుడు ఆయనను అవమానపరచు చున్నాము.

## ప్రభురాత్రి భోజనములో ఆయనను ఘనపరచాలి

ప్రభురాత్రి భోజనంలో పాలు పొందుటద్వారా మనం క్రీస్తును ఘనపరుస్తాం. సిలువపై చనిపోక ముందు క్రీస్తు తానే ప్రభురాత్రి భోజనాన్ని స్థాపించాడు."ఆయన ఒక రొట్టె పట్టుకొని కృతజ్ఞతాస్తులు చెల్లించి దానిని విరచి వారికిచ్చి- ఇది మీకొరకు యియ్యబడుచున్న నాశరీరము. నన్ను జ్ఞాపకము చేసికొనుట కొరకు దీనిని చేయుడని చెప్పెను. ఆప్రకారమే భోజనమైన తరువాత ఆయన గిన్నెయు పట్టుకొని, ఈ గిన్నె మికొరకు చిందింప బడుచున్న నారక్తము వలనైన "క్రొత్త నిబంధన"(లూకా 22:19,20). సంఘారంభమునుండి శిష్యులు రొట్టె విరుచుట యందు ఎడతెగక యుండిరి(అపో.కా.2:42). తరువాత ఆదిమ సంఘస్థులు ప్రతి ఆదివారము దీనిని ఆచరించునట్లు చూడగలము(అపో,కా. 20:7).

## నామములో

"క్రైస్తవుడు" అను నామమును ధరించుటలో మనం క్రీస్తును ఘనపరుస్తాం. క్రీస్తు పేరు పలుకకుండా క్రైస్తవుడనే పదం పలుకలేము. మొట్ట మొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులన బడిరని బైబిలు చెప్పుచున్నది (అపో.కా.11:26). అపో.కా.26:28లలో అగ్రిప్ప

పౌలుతో "ఇంత సుళభముగా నన్ను క్రైస్తవునిగా చేయజూచు చున్నావే" యని అన్నాడు. 1పేతురు 4:15,16లలో ఇట్లున్నది. "మీలో ఎవడును నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగాని, పరులజోలికి పోవువాడుగా గాని బాధ అనుభవింప తగదు. ఎవడైనను క్రైస్తవుడైనందున బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గు పడక, ఆపేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను."క్రైస్తవుడనగా క్రీస్తుకు చెందినవాడని యర్ధము. ఈ నామము ధరించుట క్రీస్తును ఘనపరచుయే. ఈ నామమును ధరించని యెడల ఆయనను అవమానపరచుయే.

క్రైస్తవుడనగా క్రీస్తు యొక్క శిష్యుడు, ఆయనను వెంబడించు వాడనియర్ధము. ఒకడు క్రైస్తవుడు కాగొరుచున్న యెడల మొదట అతడు క్రీస్తును గూర్చి వినవలెను.ఏలయనగా "వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). క్రీస్తును గూర్చి వినిన తరువాత ఆయన దేవుని కుమారుడని విశ్వసించాలి. "నేను ఆయననని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపముల లోనే యుండి చనిపోవుదురని " యేసు ప్రభువు చెప్పారు, ఇట్లు విశ్వసించిన తరువాత పాపముల విషయమై మారు మనస్సు పొందాలి. ఆయన మనలో ఎవడును నశింప వలెనని యిచ్ఛ యింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మన యెడల దీర్ఘశాంతము కలిగి యున్నాడు(2పేతురు 3:9). సరిగదా మనుష్యులందరు, అన్నిచోట్ల మారుమనస్సు పొందవలనని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు(అపొ.కా. 17:30). అటు తరువాత పాపక్షమాపణ నియిత్తం క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందవలెను,"మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు "(అపొ.కా. 2:38). అట్లు క్రైస్తవుడవై క్రీస్తు సంఘములో క్రీస్తును ఆరాధిస్తూ మరణ పర్యంతము నమ్మకముగా యుండుము, నీ జీవితం ద్వారా క్రీస్తును ఘన పరచుము.

-రోయ్ బీస్లే.

# దేవుని బోధలు మరియు మానవుని బోధలు

# (Teachings of God and Man )

దేవుడు మానవున్ని సృజించాడు. మానవుడు. తన స్వంత బుద్దిని ఆధారము చేసుకుని దేవుని గ్రంధమునుండి తన కిష్టమైనవి కొన్నింటిని మాత్రము ఎంచుకొని తనకు యిష్టము కానివి కొన్నింటిని తీసివేసి కొన్నింటిని కలిపి వేయుచున్నాడు. తనకు సులువుగా నుండు మార్గములను అనుసరించు చున్నాడు. కష్టమైనవి వదలి వేయుచున్నాడు. అందు వలన ప్రపంచములో ఎన్నో మత శాఖలు తయారగు చున్నవి. స్వనీతిని స్థాపించుకొనుచు దేవుని నీతికి లోబడుట లేదు. రోమా 10:3

దేవుని మార్గములు సరియైనవి. నిజమైనవి ప్రఖ్యాతి గలవి. ఎంతో ప్రసిద్దిగలవి, పరిశుద్ధమైనవి. మనలను పరలోకమునకు నడిపించునవి. అన్ని విషయాలలో ప్రయోజనకరమైనవి, IIతిమోతి. 3-16-17

కాని మానవుని మార్గములు సరియైనవి కావు. నిజమైనవి అంతకంతే కావు. నరకానికి నడిపించును. అందుకే బైబిలు ఈ విధముగా చెప్పుచున్నది. నా తలంపులు మీ తలంపులవంటివి కావు. మీ త్రోవలు నాత్రోవలువంటివి కావు. యెషయా 55:8-9.

ఈ క్రింద యివ్వబడిన దేవుని లేఖనములను, మానవబోధలను చదివి జాగ్రత్తగా పరిశీలించి దేవునికి లోబడి జీవించుదము.

| దేవుని బోధలు | మావవుని బోధలు |
|---|---|
| 1. శరీరమొక్కటే ఎఫెసీ 4:4. శరీరము అయిన సంఘము. ఎఫెసీ 1:23. 1 కొరిందీ 1:20, ఒక్క సంఘము మాత్రమే అదే క్రీస్తు సంఘము. రోమా. 16:16. | 1. అనేక సంఘములు ఉన్నవి అవి లెక్కకు మించిన సంఘములు. |
| 2. ఒక్క పేరును కలిగి యుండిరి (క్రైస్తవలు మాత్రమే) అపోకా 11:26; 26:28. 1పేతురు. 4:16 | 2. బాప్టిస్టు క్రైస్తవులు. పెంతికోస్తు క్రైస్తవులు, మెధడిస్టు క్రైస్తవులు. మొదలగునవి. |

| | |
|---|---|
| 3. క్రీస్తులోను ఆయన సంఘములో రక్షణ కలుగును ఎఫెసీ 5:23, 24 | 3. సంఘమునకు బయట ఉన్నను రక్షణ కలుగును. |
| 4. నమ్మి బాప్తిస్మము పొందినవారు రక్షించబడెదరు మార్కు 16:16. | 4. బాప్తీస్మము అవసరము లేకుండ నే నమ్మిన రక్షించ బడుదురు. |
| 5. వినుట వలన విశ్వాసము కలుగును. క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును. రోమా. 10:17 | 5. మొదట మారు మనస్సుపొందాలి. |
| 6. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు నపుంసకునకు బాప్తీస్మమిచ్చెను. అపో.కా. 8:36-38 | 6. ఒక పాత్రలో నీళ్ళు తీసుకొని తలపై పోయుదురు. యిద్దరును నీటి బయట నుందురు. |
| 7. బాప్తీస్మమనగా సమాధి చేయబడిన క్రీస్తు మరణము నుండి లేచిన విధముగా నీటిలో ముంచబడి లేవబడుట. రోమా. 6:3-4. | 7. కొన్ని నీళ్ళను మాత్రమే తలపై చిలకరించి నీళ్ళను తలపై పోయుదురు. |
| 8. మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివారు యేసునామమున బాప్తీస్మము పొందవలెను అపో.కా. 2:38. | 8. బాప్తీస్మము లేకుండనే మారు మనస్సు పొందుట వలన పావములు క్షమించబడును. |
| 9. అపోస్తలుల బోధ యందును, సహవాస మందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి(అపో.కా. 2:42). | 9. మనుష్యులు కల్పించు పద్ధతుల యందు కొనసాగుదురు. |
| 10. మనము మాట చేతగాని క్రియ చేతగాని మరేమి చేసినను ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయాలి. కొలొస్సయి. 3:17 | 10. మనుష్యుల గొప్పతనము కొరకు, మెప్పుకొరకు మనుష్యుల నామమున గొప్ప గొప్ప సంస్థలు నెలకొల్పుదురు. |

11. ఒకడు బోధించిన ఎడల దేవుని దైవోక్తులను బోధించినట్టు బోధింపవలెను. 1 పేతురు 4:11.

11. దేవుని బోధలను విడిచి మానవులు కల్పించిన పిట్టకథలను బోధించెదరు.

12. వారములో మొదటి దినమైన ఆదివారము న రొట్టెవిరవవలెను. అపో.కా. 20:7 క్రీస్తు ప్రభువు సమాధిని గెలిచిన దినము కూడ ఆదివారము అని గ్రహించాలి. లూకా.24:1-6.

12. సంవత్సరమునకు ఒకసారి లేదా మూడు నెలలకొక సారి లేదా నెలలో ఒకసారి మాత్రమే రొట్టె విరిచెదరు. ఇంకా కొన్ని సంఘములలో ఆరాధనలో ప్రభురాత్రి భోజనమే ఉండదు.

13. కీర్తనలతోను, సంగీములతోను, ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువుని గూర్చి పాడుచుండాలి. ఎఫెసీ 5:19, కొలొస్సయి 3:16

13. వాయిద్యములతోను అనగా తబలా, హార్మోనియం, కంజీర మొదలగు నిర్జీవ వస్తువులతో పాటలు పాడుదురు. అవి ఎవరిని హెచ్చరించవు. ఎవరికి బోధించవు. వాటిని వాయించువారి మనస్సు దేవునిపై కాకుండా వాయిద్యములపైన ఉండును.

14. ప్రతి ఆదివారము మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన తన యొద్దకొంత సొమ్ము నిలువచేయ వలెను. కొరింథీ 16:1-2.

14. ప్రతి ఆదివారము మాత్రమే కాకుండా ప్రతి ప్రత్యేక మీటింగులలో ఏదినమైన అనగా ఆదివారం మొదలు కొని శనివారం వరకు చందాలు ప్రోగు చేయుదురు.

15. ఆయన నామము పరిశుద్ధమైనది పూజింప దగినది.(Revarend) రెవరెండ్-

15. దేవునికి రావలసిన ఘనతను పూజింప తగినవి (Revarend ) అను బిరుదులు బోధలు పెట్టుకొందురు.

## ముగింపు

ప్రియమైన చదువరి! జీవితము ఎంతో చిన్నది. మరణము అనుకొనని గడియలో సంభవించును. దేవుని వైపు తిరుగుము. ఆయనకు మాత్రము లోబడుము. కాని మానవుని బోధలకు స్వంత విధులకు కాదు. ఎందుకనగా ఒకని ఎదుట సరియైనదిగా కనపడు మార్గము కలదు. అయితే అది తుదకు మరణమునకు త్రోవతీయును సామెతలు 14:12. దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసుక్రీస్తు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన జరుగును. II థెస్స 1:7-8. దేవుని బోధలను నమ్మెదవా? లేక మానవుని బోధనలను నమ్మెదవా? పరీక్షించుకొనుము.

E.రత్నం, హైదరాబాదు.

( సత్య వాక్యములు సౌజన్యంతో )

# నీవు దేనిని వెదకు చున్నావు?

మనం దేవుని రాజ్యాన్ని వెదకాలి. అన్నిటి కంటే ముందు ఆయన సంఘాన్ని, ఆయన వాక్యాన్ని వెదకాలి (మత్తయి 6:33). శరీరాను సారమైన సంగతుల కంటే ఆత్మాను సారమైన సంగతులకు ప్రాధాన్యత ఇవ్వాలి (రోమా 8:6). ప్రతి ఆదివారమున ఏదో ఒక ఆలయములో కూడుకొని ఆరాధనకు హాజరవుట మాత్రమే క్రైస్తవ్యము కాదు. ఆరాధనకు వెళ్లిన తరువాత నీ యాత్మ, మనస్సు అందులో లగ్నమై యుండకపోతే నీ ఆరాధన పెదవులతో మాత్రమే చేసినట్లవుతాది. నీ హృదయం కూడ అక్కడ ఉండాలి (మత్తయి 15:9). మిగతా క్రైస్తవులతో కలిసి ఆరాధించుటకు, సహవసించుటకు కాంక్షించకుండా సినీమాలకు, విలాసాలకు నీవు ఆరాధన సమయాన్ని వెచ్చిస్తే నీలో గొప్ప లోపం వున్నదని అర్థం. శరీర సంబంధ వ్యాయామం కంటె దైవభక్తి అన్ని విషయములలోను ప్రయోజన కరమైనది (I తిమోతి 4:8-10). మనం శ్రేష్ఠమైన కార్యములకు వివేచిస్తు అభివృద్ధి జెందాలని దేవుడు కోరు చున్నాడు (ఫిలిప్పీ 1:10).

-- 0 --

పరిసర ప్రాంతములలోను బొంతా మోజెస్ గారు క్రీస్తుకొరకు చేయుచున్న పని ప్రశంసనీయమైనది.

ఆగస్టు నెల సువార్తికుల సదస్సు 28వ తేదీన అంతర్వేది పాలెంలో ఆశీర్వాదకరంగా జరిగెను. వివిధ జిల్లాలనుండి తరలి వచ్చిన సువార్తికుల సమక్షంలో "క్రైస్తవ ఆరాధనలో వాద్య సంగీతము ఉపయోగించ వచ్చునా"? అను అంశము చర్చింపబడెను. సోదరులు వి.చిన్నయ్య, ఇ.కె.వి. ప్రసాదరావు, టి.సిహెచ్. ఫ్లెమింగ్స్, యన్.ఏలీయా, ఆర్.సమూయేలు, డి.ఇశ్రాయేలు రాజు, పాల్ గూటం, బి.ధర్మరాజు మరియు జాషువా గూటం గార్లు పైఅంశముపై చక్కని వర్తమానమును అందించిరి.

పాత నిబంధన, క్రొత్త నిబంధనల మధ్య వ్యత్యాసాన్ని లేఖనాలు చక్కగా విశదీకరిస్తున్నాయి. ఒకటి యూదుల కివ్వబడిన చట్టము. రెండవది క్రైస్తవుల కివ్వబడిన శ్రేష్టమైన నిబంధన. యూదుల చట్టమైన పాత నిబంధన ఆరాదనలో వాయిద్యములు ఉపయోగింపడినవి. క్రొత్త నిబంధనలో అంటే ఆదిమ క్రీస్తు సంఘములో వాయిద్యముల ప్రస్తావన కనిపించదు. ఆదిమ సంఘము వాయిద్యములను ఉపయోగించినట్లు ఎక్కడ కనిపించదు. మొట్టమొదట క్రీ.శ 670 సం॥రములో పోప్ వైటాలిన్ I అనునతడు ఆర్గానును ప్రవేశపెట్టెను. యిందువలన కేథలిక్ సంఘములో కలవరము కలుగుటయేగాక విభజన అనివార్యమయ్యెను. ఆనాడు ఈ అంశముపై విడిపోయిన గ్రీకు కేథలిక్‌సంఘము నేటికిని వాయిద్యములను ఉపయోగించుట లేదు. ప్రాటస్టాంటు సంఘాల నాయకులైన మార్టిన్ లూథరు, జాన్‌కేల్విన్‌మొ॥వారు వాయిద్యములను ఆరాధనలో ఉపయోగించుట నిరాకరించిరి. క్రొత్త నిబంధనలోపాడుటను గూర్చి 10 వచన భాగాలున్నాయి. ప్రతి మంచి వ్యక్తి ఈ వచన భాగాలు "పాడుట" ను గూర్చి మాత్రమే చెప్పబడెనని ఒప్పుకొనును. ఎఫె 5:19లోను కొలస్స 3:16 లోను వ్రాయబడిన (తెలుగు బైబిలు నందు) "సంగీతము" అను మాట గాత్ర సంగీతమును గూర్చి చెప్పబడింది. ఎందుకంటే హెచ్చరించుట, పాడుట, కీర్తించుట , బుద్ధిచెప్పుట, బోధించుట అను కార్యములు గాత్ర సంగీతము చేయగలదు. నిర్జీవ నాదమైన వాయిద్యము చేయలేదు. గాత్ర సంగీతమైన పాటలు, కీర్తనలు, పద్యములను ఆర్.సమూయేలు గారు చక్కగా పాడి వినిపించిరి. "ఆత్మతో పాడుదును మనస్సుతో పాడుదును" I కొరింధీ 14:15 ఆత్మతో, మనస్సుతో పాడవలెనని ఆజ్ఞాపింపబడింది గనుక వాయిద్యము అవసరంలేదని వేరే చెప్పనవసరము లేదు.

క్రొత్త నిబంధన యందలి 10 వచన భాగాలు:

మత్త 26:30, మార్కు 14:28 అ॥కా 16:28 రోమా 15:9, I కొరింధీ 14:16, ఎఫె 5:19 కొలస్స 3:16, హెబ్రీ 2:12, హెబ్రీ 13:15 యాకోబు 4:13. దేవుని ఆత్మతో సత్యముతో ఆరాధించాలి. శరీరముతో ఆయన ఆరాధించబడడు.

భౌతిక విషయాలతో దేవుడు ఆరాధించబడువాడు కాడు, ఆయన చేతులతో సేవింపబడు వాడుకాదు (అపొ.కా.17:25). ఆయననకు బలులు, పొట్టేళ్ళ రక్తము, వాద్య సంగీతము అవసరంలేదు. ఆయనకు స్తుతి యాగము చేయుము (కీర్త 50:13-14). ఆరాధన ద్వారా క్రీస్తు సారూప్యము పొందగలము. కయీను సంతతి వాయిద్యము, పదునుగల రాగి పనిముట్లు, బహుభార్యాత్వమును, నరహత్యను తీసికొని వచ్చెను. ఆది 4:16-24.

అంతర్వేది పాలెం పరిసర ప్రాంతాలలో టి. చైతన్యపాల్ గారు గొప్ప పని చేయుచున్నారు. సదస్సు కొరకు మంచి ఏర్పాట్లు చేసి మంచి ఆతిథ్యము నిచ్చిరి.

---

Regd. No. H / KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month

From:
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To